# కొండగాలి వంటబట్టిన కొండబాబు

కొండబాబుని చూసిన క్షణంలో అతన్ని గుర్తుపట్టలేకపోయాను. గుర్తుపట్టిన మరుక్షణం అతన్ని పలకరిస్తే విషాదగాథలు వినిపిస్తాడని భయంచేత మొహం చాటేసుకున్నాను. చాటేసుకున్నకొద్దీ వాటేసుకుని అతనే పలకరించేక యెలా వూరుకోడం !

కొండబాబు తండ్రిని నక్సలైట్లు చంపేశారు. ఏజెన్సీ దిగువన ఒక పల్లెటూళ్ళో వుండేవాడాయన. కొండవాళ్ళకి డబ్బు అప్పులిచ్చి, కొండమీద దొరకని సరుకూ, సామగ్రీ ఎక్కువ ధరలకి అమ్మి వాళ్ళ భూములను తన పేరిటికి చాలా ఎకరాలు బదలాయించుకున్నాడు. ఆ భూములమీద వ్యవసాయప్పనికి వాళ్ళనే పెట్టి ఆ కూలి డబ్బులు అడ్వాన్సుల కింద ఇచ్చి వాటికి పంట సైముదాకా వడ్డీలు కట్టి వాళ్ళని క్రీస్తు పూర్వపు రోజుల్లో బానిసలకన్నా అధ్వాన్నంగా చూసేడు. ఇదంతా కొందరు కుర్రాళ్ళకి నచ్చక ఓ అర్థరాత్రి అతని ఇంటిమీద సాయుధంగా దాడిచేసి అతని దగ్గర ఆనాటికి వున్న నగలూ, నగదూ, ప్రోనోట్లు, భూముల దస్తావేజులూ అన్నీ లాక్కుని అతన్ని దారుణంగా చంపేశారు. అతన్ని తెలిసినవాళ్ళు గాని, కేవలం అతని దుశ్చర్యలే తెలిసినవాళ్లు గాని, "ఘోరం'' అని మాత్రం అనగలిగిన సన్నివేశం అది.

అది ఐదారేళ్ళ కిందటి మాట. అప్పట్లో కొండబాబు హైదరాబాదులో ఏదో ఉద్యోగానికి ట్రెయినింగ్ అవుతున్నాడు. ఆ తరువాత ఇప్పుడే చూడ్డం కొండబాబుని.

షేక్హాండిచ్చుకున్నాక అడిగాను. "ఏం చేస్తున్నావిప్పుడు?''

''వ్యాపారం!'' అన్నాడు కొండబాబు చిరునవ్వుతో.

''అదేమిటీ! ఏదో పెద్ద ఉద్యోగానికి సెలక్టయ్యావని, ట్రెయినింగయ్యావని విన్నాను! ఆ ఉద్యోగంలో చేర్లేదా?'' అన్నాను.

''ఉద్యోగం అంటే వ్యాపారం కాకపోయినా, వ్యాపారమే డ్యూటీగా గల ఉద్యోగం ఎందుకు చెైకూడదు?''

''వ్యాపారం అంటే, ఏదైనా సరుకును అది దొరికే దగ్గిర కొని గిరాకీ వున్న దగ్గిర అమ్మడం అని నా ఉద్దేశం!'' అని పేల్చాను.

''ఎగ్జాక్టలీ అదే నేను చేస్తున్న పని. చింతపండు, కుంకుడు కాయలు, శీకాయి, అడ్డాకు, ఇప్పపిక్క, పాలగుండ, తేనె ఇలాంటి సరుకు కొండమీద కొని టౌన్లో అమ్మిస్తున్నాను!''

''దానికి లైసెన్సులు అందరికీ ఇవ్వరుగా.''

''లైసెన్సేం కర్మ, జీతమే ఇస్తున్నారుగా నాకు!''

''అంటే, కె. పి. ఎస్. కంపెనీలో పనా?'' (కె. పి. ఎస్. కంపెనీ అంటే కొండ ప్రజల సంక్షేమ కంపెనీ)

''సరిగ్గా వూహించేవు!'' అని వీపుతట్టి మెచ్చుకున్నాడు కొండబాబు.

''పోన్లే పాపం లాభసాటిగా వుంటోందా!''

"ఏదో సో-సో-'' అని చిరునవ్వు విసిరి, కథలా చెప్పాడు. "నాన్నగారు కొండప్రాంతం అంతా పాదచారిగా తిరిగి, సంపాదించు కున్నదంతా ఒక్క రాత్రిలో పోగొట్టుకున్నారు. నేను కంపెనీ లారీల మీద తిరిగి సంతలకి సంతలు కొంటున్నాను. ఒక్కొక్క కొనుగోల్లో కంపెనీకి పదివేలు ఖర్చు! పన్నెండువేలు ఆదాయం. అందులో కొండ జాతి ప్రజలకి న్యాయంగా వెళ్ళవలసిందానికన్నా ఒక వెయ్యి ఎక్కువ వెళితే నాకో వెయ్యి వస్తుంది. నెలకి మూడు నాలుగుసార్లు కొనుగోలు పనిమీద కొండల్లోకి వెడతాను!''

"మీ సౌందర్య రహస్యం ఏమిటి?'' అని సినిమాతారని సబ్బుల కంపెనీ ప్రకటనల ఏజంటు అడిగినట్టుగా అడిగాను అతని ఆదాయ రహస్యం.

కొండ తాలూకా ముఖ్య గ్రామంలో కొండబాబు మోటారు సైకిలుంటుంది. రేపు సంత జరుగుతుందనగా తొలిరోజు రాత్రికే కొండబాబు సంత జరిగే గ్రామానికి వెళతాడు. అక్కడ తాను వుంచిన ఒక ముఠాదారుణ్ణి ఆ రాత్రికి సత్కరించి సంతృప్తి పరుస్తాడు. మర్నాడు సంతలో కె. పి. ఎస్. కంపెనీకి తప్ప మరెవ్వరికీ యేదీ అమ్మబడదు. ఇచ్చిన సరుకు తూనిక, లెక్క సమంగానే వుంటాయి. కాని ధర మాత్రం కొండవాళ్ళు నిర్ణయించిన దానికి నూటికి ఇరవై ఎక్కువపెట్టి రసీదులు రాయించుకుంటాడు. పది కొండవాళ్ళకీ ముఠా దారుకీ వెళతాయి. పది కొండబాబుకి వస్తాయి. ఆ సరుకంతా కంపెనీ లారీలమీద టౌనుకి చేర్చి నూటికి కొన్న సరుకుధర నూటఇరవైగా నిర్ణయిస్తాడు. అలా నెలకి మూడు నాలుగు సంతల సరుకు కంపెనీకి కొంటాడన్నమాట కొండబాబు.

"కంపెనీలో మిగిలిన ఉద్యోగులు వూరుకుంటారా?'' అని సందేహం వెలిబుచ్చాను.

''అప్పుడప్పుడు గొడవ చేస్తారు. కొందరికి సరుకిష్టం, కొందరికి కొండ ప్రాంతంలో విహారం ఇష్టం, కొందరికి వర్సంటేజి లిష్టం. ఎవరి కావలసింది వాళ్ళ కేర్పాటుచేస్తూ నా ఉద్యోగ ధర్మం నేను నిర్వహిస్తున్నాను. కొండల్ని నమ్మి మా నాన్న చెడ్డాడని నేనూ చెడ తానా? నా పేరే కొండబాబు కదా.''

''నీ మీద అసూయచేత ఎవరైనా నిన్ను ట్రాన్స్ఫర్ చేస్తే?''

''మూడేళ్ళకోసారి ట్రాన్స్ఫర్ అవుతుంది. కాని ఆర్నెల్లు అక్కడచేసి మళ్ళీ కొండబాబునై పోతాను!''

కొండబాబుకి కొండగాలి బాగా వంట పట్టింది. అతను పని చేస్తున్న కంపెనీ ఆదర్శాలే అతనికి కొండంత అండ!

(31-12-77)